# ప్రేమ

"ఏయ్!... నిన్నే!"

ఉలికిపడ్డాను.

"ఎవరు నువ్వు? ఇక్కడి వాడివిగా లేవే? నీ 'పర్మిట్' చూపించు."

"నా దగ్గిర పర్మిట్ ఏదీ లేనట్టుందే!" అన్నాను.

"అంటే లేదనా, ఉందనా?"

"పర్మిట్ తప్పకుండా ఉండాలా ఏమిటి?"

"ఇది ప్రొహిబిటెడ్ ఏరియా, తెలుసునా?"

"తెలీదు."

"అయితే వెళ్లు."

"ఎట్లా వెళ్లను? నాక్కావలసిన వాళ్లంతా ఈ లోపలే ఉన్నారు."

"ఉంటే ఉండనీ. నువ్వాళ్లని చూడటానికి వీల్లేదు. వీలుంటే నీకూ పర్మిట్ ఇచ్చి పిలిపించే ఉందు."

"మా దేశంలో 26 ఏళ్లకే మైనారిటీ వెళ్లిపోతుంది. నేను మేజర్ని. నన్ను కాస్సేపు లోపలికి పోనివ్వరాదా?"

"మీది ఏ దేశం?"

"భరత ఖండంబు చక్కని పాడియావు. లేదురా యిటువంటి భూదేవి యెందు."

"నన్ను కూడా కలపకు. నేను దివ్యమైన నీగ్రోవాణ్ని. అయితే మీ దేశంలో ఇరవై ఆరేళ్లకే పెద్దల్లో చేరటమేమీ?"

"అదేమో, నన్నడక్కు. మా చక్రవర్తి నడుగు. చల్లని పరిపాలన కింద ఉన్నాం గనక ఇంతకాలమైనా మైనారిటీ అనుభవిస్తున్నామనుకో! లేకపోతే –"

"నిన్ను చూస్తే నాకు చాలా విచారంగానే ఉందిగాని, ఇంత కాలం వచ్చిన వాడివి చూస్తూ చూస్తూ ఈ ఆవరణలో కెందుకు పోతావ్? ఇంకో ఆవరణ చూసుకోరాదూ?"

"ఈ అవరణలో ఎవరుంటారేం?"

"ప్రేమించిన వాళ్లు."

"చెప్పవేం? నాకు వాళ్లే కావాలి. నేను ప్రేమించినవాళ్లంతా ఇందులోనే ఉంటారు."

"నేనంత నమ్మకంగా చెప్పలేను. అయినా చల్లగా లోపలికెళ్లి ఎవరికంటా పడకుండా తిరిగిరా!"

నేను లోపలికెళ్లబోతూ ఏవో పెద్ద పెట్టున ఆర్తనాదాలు విని ఆగాను.

"ఎవరో, పాపం, ఏడుస్తున్నట్టున్నారేం?" అన్నాను.

"వాళ్లు తాగి వున్న సిపాయిలు. వాళ్ల పెళ్లాలు వాళ్లని మరిచిపోయి మరోళ్లతో హాయిగా కాలక్షేపం చేస్తున్నందుకు వీళ్లిక్కణ్నించి ఏడుస్తారు. వాళ్ల జోలికి మటుకు పోకు."

"ఇక్కడంతా ఇటువంటి వాళ్లేనా? ఎందుకంటే నేను ప్రేమించిన వాళ్లీరకం కాదేమో నని అనుమానంగా ఉంది."

"ఇంకా చాలా రకాలున్నారు. వెళ్లి చూసిరా. ఇంత దూరం రానే వచ్చావు."

ఒక సిపాయి ఒళ్లో ఇద్దరమ్మాయిలని కూర్చోబెట్టుకుని రెండు చేతులా రెండు బుడ్లు పట్టుకుని అవి కాస్త కాస్తే తాగుతూ, మధ్య మధ్య ఇద్దర్నీ ముద్దులాడుతూ, ఇందుట్లో తీరిక చేసుకుని పెద్ద పెట్టున ఏడుస్తున్నాడు.

"ఎందుకు నాయనా, పాపం, ఏడుస్తున్నావ్?" అన్నాను.

"కనిపించటంలేదా? నేను ప్రేమిస్తున్నాను" అన్నాడు సిపాయి. నాకేసి కోపంగా చూస్తూ.

"అయితే మరి ఏడు పెందుకురా? పిచ్చినాన్నా?" అన్నాను ఓదార్పుగా.

సిపాయి తన ఒళ్లో ఉన్న ఇద్దరికేసీ అసహ్యంగా చూసి, "ఇదా? ఇది ప్రేమ కాదు. కామం" అని ఇద్దర్నీ ఒక్కసారే అదుముకుని గట్టిగా ముద్దు పెట్టుకుని, "నేనేడుస్తున్నది, దీనికోసం కాదు. నిజమైన ప్రేమ నీకేం తెలుసు?" అన్నాడు.

"అయితే, పాపం, నువ్వు నిజంగా ప్రేమిస్తున్నదెవర్ని?" అన్నాను.

సిపాయి బిక్క మొహం పెట్టి పట్టలేకుండా ఏడుస్తూ, హె-హె-హెడీల-హ-హ-మార్ను! అని శోకం పెట్టాడు.

నేనక్కడ ఉండటం భావ్యం కాదని అవతలికి తప్పుకున్నాను.

***ముద్రణ : ఆనందవాణి, 26 నవంబర్ 1944***